## పటేల్ కుంట చెరువును సుందరీకరిస్తా

**ఉప్పల్, జూన్ 10 :** నాచారం డివిజన్‌లోని పటేల్ కుంట చెరువును మంగళవారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పటేల్ కుంట చెరువును సుందరీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా పటేల్ కుంట చెరువులో నీరు నిల్వ లేని కారణంగా యంత్రం సాయంతో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టడం ఇబ్బందిగా మారిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ఘట్ కేసర్, జూన్ 10:** పచ్చదనం పరిశుభ్రతను ప్రతి ఒక్కరి బాధ్యత అని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధి మర్రిపల్లిగూడలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు తడి చెత్త, పొడిచెత్త, హోం కంపోస్టింగ్, యానిమల్ బర్త్ కంట్రోల్‌పై అవగాహన నిర్వహించారు. అనంతరం ఒక మార్పు-అభివృద్ధికి మలుపు అనే నినాదంతో మర్రిపల్లిగూడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు మున్సిపల్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు ముగింపు

**బోడుప్పల్,జూన్ 10:** మాతా నిమిషాంభిక దేవి ఏకోన వింశాంతి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య సంస్థానాదిశ్వరులు శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ హాజరయ్యారు. పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు కావడంతో భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ, బీజేపీ నాయకురాలు మాధవి లత, డీఈ చిరంజీవి, మాజీ మేయర్ అజయ్ యాదవ్, నరసింహారెడ్డి, నరసింహ, యాదగిరి, కిశోర్ గౌడ్, విక్రం రెడ్డి, శ్రీనివాస్, ఆలయ చైర్మన్ వినోద్ కుమార్, ఆలే ట్రస్టు నిర్వాహకులు అశోక్ కుమార్, శ్రీనివాస్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## అనుమానమే పెనుభూతమై... భార్యను హత్యచేసిన భర్త

జవహర్‌నగర్, జూన్ 10: అనుమానమే పెనుభూతమై కోపం పెంచుకున్న భర్త... భార్యను హత్య చేశాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కార్మికనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ పరిధి కార్మికనగర్‌లో తమ్మిడి అశోక్(36), సౌందర్య(32), కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తుండేవారు. అశోక్‌పై గతంలో ఫోక్సో కేసు నమోదవ్వగా కుటుంబంతో కలిసి ఉండటంలేదు. భార్య సౌందర్య ఇండ్లల్లో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. తాగుడుకు బానిసైన భర్త అశోక్ నిత్యం సౌందర్యను వేధింపులకు గురిచేస్తుండేవాడు. మంగళవారం దమ్మాయిగూలోని ఇండ్లల్లో పని చేసుకుని కార్మికనగర్‌లోని ఇంటికి సౌందర్య వెళ్తుండగా అశోక్ కృపాసన చర్చి సమీపంలో దారికాచి ఆమెపై రాడ్డుతో తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు సౌందర్యను దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వార్డుల విభజనపై అభ్యంతరాలు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, నాగిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, గ్రామస్తులు.

**కమిషనర్, అదనపు కలెక్టర్‌కు వినతి**

**శామీర్‌పేట,జూన్ 10 :** మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయ పరిధిలో వార్డుల విభజన సక్రమంగా నిర్వహించాలని నాగిశెట్టిపల్లి డీసీఎంఎస్ లవైస్ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మొగుళ్ళ కృపాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ప్రభుత్వంలో కేశవరం అనుబంధ గ్రామం నుంచి గ్రామ పంచాయతీగా ఏర్పాటైన నాగిశెట్టిపల్లిని వార్డుల విభజనలో కొల్తూర్ గ్రామానికి కలుపుతానని ప్రతిపాదనలు చేయడం సరికాదన్నారు. వార్డుల విభజనలో అఖిలపక్ష నేతలతో పాటు ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. నాగిశెట్టిపల్లిని కొల్తూర్ గ్రామానికి కాకుండా గతంలో మాదిరిగానే కేశవరం గ్రామానికి కేటాయించి ఆవార్డులోనే చేర్చాలని కోరా రు.అదే విధంగా మూడుచింతలపల్లి నుంచి గ్రామ పంచాయతీగా ఏర్పాటైన లింగాపూర్ తండాను సైతం మూడుచింతలపల్లి వార్డులోనే చేర్చాలని కమిషనర్ పవన్‌కుమార్‌కు లింగాపూర్ తండా మాజీ సర్పంచ్ గోపీనాయక్, కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు.

## మొహర్రానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి,జూన్10:** మొహర్రం పండుగకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మొహర్రం పండుగ ఏర్పాట్లపై డాక్టర్ బీ.ఆర్అంబేద్కర్ తెలంగాణ సచివాలయం రవాణా శాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ మొహర్రం పండుగను మౌలాలిలోని 12 ఆషుర్ ఖానలు వాటికి గతంలో ఒక రూపాయి కూడా కేటాయించి అభివృద్ధి ఏర్పాట్లకు నోచుకోలేదన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని అక్కడకు కావలసిన ఏర్పాట్లు చేయాలని, రోడ్ల అభివృద్ధి, బ్యూటిఫికేషన్, విద్యుత్ దీపాలు, శానిటేషన్ డ్రింకింగ్ వాటర్, మొబైల్ ట్రాన్స్ఫార్మర్, మొబైల్ టాయిలెట్స్, ట్రాఫిక్ క్లియరెన్స్, వంటి సదుపాయవంటి కల్పించాలన్నారు. మౌలాలి ప్రాంతం పెద్ద ముస్లిం కమ్యూనిటీ తోటి ఏర్పడిన ప్రాంతం మౌలాలి దర్గాకు ఆలమును వివిధ ప్రాంతంలో నుంచి తీసుకొని వస్తారని అన్నారు. అల్వాల్ సర్కిల్ వెంకటాపురంలో బోరా కమ్యూనిటీ వారు ప్రత్యేకంగా రోజుకు 15000 మంది ప్రార్థనలో పాల్గొంటారని, అందులో 11 వేల మంది చెన్నై నుండి అతిథులు వస్తారని, స్థానికంగా నాలుగు వేల మంది బోర కమ్యూనిటీ వారు మొహరం ప్రార్థనలో పాల్గొంటారని అన్నారు. ఈనెల 26 నుంచి జూలై 7వరకు జరుగుతాయని, వారికి ప్రభుత్వం కనీస వసతులు కల్పించాలని, ఈవెంట్ పర్మిషన్లు ఇవ్వాలని , వీటికి సంబంధించి వక్స్ బోర్డ్, మైనార్టీ డెవలప్మెంట్ ఇవ్వాలని అన్నారు. పండగ సందర్భంగా కోఆర్డినేటర్లును నియమించాలని కోరారు.

## రాంరెడ్డినగర్‌లో నల్లా నీళ్లలో డ్రైనేజీ నీరు

**రామంతాపూర్.జూన్ 10:** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లోని వీధి నంబర్ 1లో మంగళవారం ఉదయం తాగునీటి నలాల్లో డ్రైనేజీ నీరు వచ్చిందని కాలనీ వాసులు ఆందోళన చెందారు. సదరు కాలనీలో ఎక్కడ నల్లా విప్పినా మురుగునీరు రావడంతో కాలనీ వాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. మురుగు నీరు తాగడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి నల్లా పైప్‌లైన్‌లో డైనేజీ ఎక్కడ కలుస్తుందో గుర్తించి బాగు చేయాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.



రాంరెడ్డినగర్‌లో తాగునీటిలో వచ్చిన డ్రైనేజీ నీరు

## పంటల మార్పిడితో అధిక దిగుబడి

**శామీర్‌పేట, జూన్ 10 :** పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు శ్రీదేవి, భార్గవి అన్నారు. మూడుచింతలపల్లి మండ లం పోతారం గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, రసాయన ఎరువుల ఉపయోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవోరవికుమార్, రైతులు, పాల్గొన్నారు.

## డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డును కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మల్లాపూర్, జూన్ 10:** ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగంగా ఆయన మంగళవారం మల్లాపూర్ డివిజన్లోని కేవల్ రెడ్డి నగర్, హెచ్ సీఎ ల్ కాలనీలలో పూర్తి అయిన సీసీ రోడ్డును కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్ రెడ్డి, ఈశ్వర్, శ్రావణ్ కుమార్, రాజు, శ్రీనివాస్, మల్లయ్య, చెల్లయ్య, నర్సింగ్, కార్తిక్, రాజేష్,నాయకులు కృష్ణ, శ్రీనివాస్, తండా వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ



కొండాపూర్ లో పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న స్ట్రీట్ కాజ్ విద్యార్థులు.

**ఘట్ కేసర్, జూన్ 10:** సామాజిక సేవలో భాగంగా సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినీవిద్యార్థులు పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. స్ట్రీట్ కాజ్ ఎస్ సీఈ టీ, జాతీయ ఎన్జీవో స్ట్రీట్ కాజ్‌తో కలిసి స్థానిక మురికివాడల సమీపంలో హృదయపూర్వక రైస్ ప్యాకెట్ డొనేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎటువంటి ఆర్థిక మద్దతు లేనప్పటికీ, బలమైన సంకల్పంతో విద్యార్థులు ధనుష్, అనిల్ కుమార్, నవీన్, శంకర్, సంజయ్, జీవన, యశస్వినితో సహా వలంటీర్లు పేదల కుటుంబాలకు బియ్యంను పంపిణీ చేసి, 30 మందికి పైగా వ్యక్తులకు ఆహార భద్రతను కల్పించారు. స్ట్రీట్ కాజ్ యొక్క సామాజిక సేవా లక్ష్యాన్ని అందరు ప్రశంశించారు.

## ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**ఘట్ కేసర్, జూన్ 10:** ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌లో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం..ఘట్ కేసర్ పట్టణం బ్రూక్ బాండ్ కాలనీలో నివాసం ఉంటున్న గుంటా రమేష్(39) బోడుప్పల్ లోని ఓ ప్రైవేటు దవాఖానలో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక సమస్యలతోపాటు కుటుంబ కలహాలు నెలకొనటంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు డోరు పగలగొట్టి స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శవాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిధులు మంజూరు చేయండి



జడ్సీ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కు మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ, ముస్లిం శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మొహర్రం పండుగకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా కిశోర్, అనిల్ కిశోర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

**కీసర, జూన్ 10:** దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి యాద్గార్‌పల్లిలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆ గ్రామంలోని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో జమదగ్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు కౌసల్య, యాదగిరి, సతీష్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

**మేడ్చల్, జూన్ 10:** రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఆర్డీవో ఉపేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి భూ సమస్య ఉన్నా తమ వద్దకు వచ్చిన అధికారులకు వివరించాలని, తగిన పత్రాలతో సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## నాసిరకం తిను బండారాల తయారీ కేంద్రంపై దాడి

**పీర్జాదిగూడ:** నాసిరకం తిను బండారాలను తయారుచేసి విక్రయిస్తున్న కేంద్రంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. ?తమిళనాడు రాష్ట్రానికి చెందిన అన్నోతి పట్టు రాజు( 59)ఉప్పల్లో నివాసం ఉంటూ పీర్జాదిగూడ పరిధిలోని సాయి నగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా కొన్నాళ్ల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా లిటిల్ ఫ్లవర్ పేరుతో నాసిరకం కారా, బూంది తదితర తినుబండారాలను తయారు చేసి పరిసర ప్రాంతాల్లోనే కిరాణా షాపుల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి మేడిపల్లి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తినుబండారాలను తయారు చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.30 వేల విలువైన 100 కిలోల కారా, బూంది, 80కిలోల మసాలా పల్లి, బఠాణి, ఉలవలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

**హెచ్‌బీకాలనీలో ఘటన, 30తులాల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండి, లక్షన్నర నగదు అపహరణ**



హెచ్‌బీకాలనీలో ఇంట్లో జరిగిన దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం బృందాలు

**చర్లపల్లి, జూన్ 10 :** ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చేసరికి గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి ఇంట్లో భద్రపరిచిన బంగారు, వెండినగలతో పాటు నగదు దోచుకెళ్లిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాప్రా సర్కిల్, హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో నివాసముండే పి.రవీందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5న ఇంటికి తాళం వేసి తిరుపతి, అరుణాచలం తీర్థయాత్రలకు వెళ్లారు. తిరిగి 9న రాత్రి ఇంటికి రావడంతో ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగిలిపోయి ఉండటంతో ఆందోళనకు గురైయ్యారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పాటు బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి ఉంది. బీరువాలోని బట్టలు, ఇతర వస్తువులు బయట పడేసి ఉండటంతో పాటు బీరువాలోని 30తులాల బంగారు అభరణలు, 2కిలోల వెండి నగలు, లక్షన్నర నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించిన రవీందర్ వెంటనే స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి బాధితుని నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని కుషాయిగూడ డివిజన్ ఏసీపీ వై.వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం బృందాలు సందర్శించి చోరీ జరిగిన తీరును పరిశీలించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

**కాలనీల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి కాలనీవాసులు**

హెచ్‌బీకాలనీ డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో భారీ దొంగతనం జరగడంతో స్థానికులు, కాలనీవాసులు ఆందోళనకు గురైయ్యారు. హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల పట్ల నిఘా పెట్టాలని స్థానికులు కోరారు.

## గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలి

- సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి ఉద్యమం
- గొర్రెల మేకల పెంపకందారుల సంఘం కార్యదర్శి రవీందర్



మాట్లాడుతున్న గొర్రెల మేకల పెంపకందారుల సంఘం కార్యదర్శి ఉడుత రవీందర్

**మేడ్చల్, జూన్ 10 :** గొల్ల కురమలకు నగదు బదిలీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేశవరంలోని సంగీత్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా మహాసభ మేకల కుమార్ మాసాని మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేముందు గొల్లకురుమలకు రూ.2లక్షలు నగదు బదిలీ చేస్తామని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచిపోయినా ఆ ఊసెత్తడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.కోట్లలో విలువ చేసే గొర్రెలు మేకల సంపద ఉందన్నారు. కానీ వాటి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు.ప్రభుత్వం తరుపున కనీసం నట్టల మందులు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నా రు. రెండు సంవత్సరాలుగా గొర్రెలమే కలకు ఏ పశువైద్యశాలకు వెళ్ళినా డాక్ట ర్లు మందులు ఇవ్వకుండా చీటీలు రాసి చేతిలో పెడుతున్నారని అన్నారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు పెరిగాయని, అటవీ భూముల్లోకి జీవాలు మేతకు రాకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో గొర్రెల దొంగతనాలు పెరుగుతున్నా పోలీసులు నివారించలేక పోతున్నారని, ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో సామూహిక గొర్రెల షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు .వెంటనే జిల్లా యూనియన్ ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రమాదాల్లో ప్రతిరోజు వందలాది గొర్రెలు మేకలు చనిపోతున్న బీమా కల్పించడం లేదన్నారు. పశుసంవర్ధక శాఖకు మంత్రిని కూడా నియమించని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉండదని, పర్మినెంట్ డైరెక్టర్ లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. నగదు బదిలీ ద్వారా రెండో విడుత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టి, శాఖకు మంత్రి ని నియమించాలని, అధికారులను కేటాయించి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సభలో వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ వెంకట్ నర్సయ్య, జిల్లా కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య, నాయకులు మాసాని మల్లేష్, బావని వెంకటేష్, బండారు మల్లేష్, గాజుల వీరేందర్, మాజీ ఎంపీటీసీ ఎం. జంగయ్య, అలియాబాద్ సర్పంచ్ గురక కుమార్, బి. శ్రీశైలం, నరసింహ, సల్ల కృష్ణ, పినిగంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవరం ఏర్పాటు

**కీసర, జూన్ 10:** శ్రీ రామలింగేశ్వరస్వామి సివిల్ కాంట్రాక్టర్స్ ఆసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. దమ్మాయిగూడ-నాగారం మున్సిపాల్టీలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు గా సింగోజి నర్సింహచారి, ప్రధాన కార్యదర్శిగా వల్లపు రమేష్, ఉపాధ్యక్షులుగా బత్తుల సైదులు, కార్యదర్శిగా రావుల శ్రీను, కోశాధికారిగా ఇరుగుదిండ్ల కృష్ణ, కన్వీనర్లుగా మక్క ల బాల్‌రాం, గౌరవ అధ్యక్షులుగా వల్లను శ్రీను, సలహాదారులుగా రామిడి రాంరెడ్డి, బోసు వెంకటయ్య, కొమ్మరాజుల కోమురయ్య, షేక్ ఆజీజ్, బోదాసు శంకరయ్య, వల్లపు సత్తయ్య, ఏనుగు లింగారెడ్డి, వల్లపు క్రాంతి కుమార్, దాసరి రంగారెడ్డి, బోదాసు శ్రీనులను ఎన్నుకున్నారు.

## 17న ఛలో ఇందిరాపార్కు

ఉప్పల్: మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నా కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సౌదారం సుభద్రమ్మ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఉప్పల్, చిల్కానగర్ పార్కులో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్ మాట్లాడుతూ రజక వృత్తిదారుల సమస్యలపై ఈనెల 17న ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాకు రజకులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో, జిల్లా గౌరవ అధ్యక్షులు, చక్రపాణి, ఉపాధ్యక్షురాలు, వరలక్ష్మి, జిల్లా కోశాధికారి, రవి, జిల్లా సహాయ కార్యదర్శి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

## బీఆర్‌ఎకే భవన్‌కు శ్రేణులు తరలిరావాలి

**బోడుప్పల్, జూన్ 10:** జస్టిస్ గోష్ కమిషన్ విచారణకు బుధవారం హాజరవుతున్న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు సంఘీభావంగా మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదేశాలతో బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్కే భవనానికి భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు బయలుదేరుతున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

**పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలి**

**కాప్రా, జూన్ 10:** పెంచిన బస్‌పాస్‌చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం కాప్రా సర్కిల్ కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బస్‌పాస్ చార్జీలను 20శాతం పెంచుతూ తెలంగాణ ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, బస్‌పాస్ చార్జీలను యథావిధిగా కొనసాగించాలని శ్రీనివాస్ అన్నారు. పెంచిన బస్‌పాస్ చార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలపై, స్కూల్ విద్యార్థులపైన ఆర్థిక భారం పడుతుందని, ఒక్కొక్కరికి నెలకు రూ.200 నుంచి రూ.300 ఆర్థికభారం పడతుందన్నారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు.

## మద్యంమత్తులో డ్రైవర్.. ట్యాంకర్ బోల్తా

**శామీర్‌పేట, జూన్ 10 :** బోల్తా కొట్టిన ట్యాంకర్‌ను క్రేన్‌సాయంతో తొలగిస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..ముంబైకి చెందిన మహ్మద్ ఫయాజ్ ట్యాంకర్‌లో కెమికల్‌ను తీసుకుని శంభాపేట్‌లోని ఎల్‌మెలో కంపెనీకి వస్తున్నాడు. శామీర్‌పేట-కీసర వైపు వెళ్తున్న క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డుపై శామీర్‌పేట శివారు ప్రాంతానికి చేరుకున్న వాహనాన్ని డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతుండగా సోమవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డు మధ్యలో బోల్తా పడింది. ఆ ట్యాంకర్‌ను తొలగించి వెలికి తీసుకేందుకు మంగళవారం క్రేన్ సహాయంతో సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో కెమికల్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే సర్వీస్ రోడ్డులో ఉన్న చెట్లు పూర్తిగా కాలిపోయాయి.పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.80లక్షల మేరకు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.



చర్లపల్లి : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాండాల శివకుమార్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు